క్లుప్తంగా

కుష్టు అనుమానితులను గుర్తించండి

శిరివెళ్ల: ఈ నెల 27 నుంచి జనవరి 12వ తేదీ వరకు మండలంలో కుష్టు వ్యాధి అనుమానితులపై సర్వే చేయాలని మండల ప్రభుత్వ వైద్యాధికారి భవ్య సూచించారు. శుక్రవారం సర్వేపై ఆశా వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇంటింటికీ తిరిగి వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించి వైద్య శాలకు పంపాలని చెప్పారు. సీహెచ్ఓ రామ్మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పరిశోధన క్షేత్రాల సందర్శన


పాకెట్ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న శాస్త్రవేత్తలు

నంద్యాల (సెంట్రల్): అఖిలభారత సమన్వయ పథకం (రబీ అపరాలు) ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ శైలేష్ త్రిపాఠి, ఏకే పరిహార్ (సస్య ప్రజననం-ఐఐపీఆర్-కాన్పూర్) సీనియర్ శాస్త్రవేత్తలు శుక్రవారం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లోని సస్య ప్రజననం, సస్యరక్షణ, సస్య విజ్ఞానం పరిశోధన క్షేత్రాలను సందర్శించి పలు సలహాలు సూచనలు చేశారు. సమీక్షలో భాగంగా డాక్టర్ జయలక్ష్మి ప్రధాన శాస్త్రవేత్త, మంజునాథ్ సీనియర్ శాస్త్రవేత్త, చైతన్య, సతీష్ బాబు, పులిబాయ్ తదితరులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం శనగ పంటలో ఇటీవల విడుదలైన కొత్త వంగడాలపై రూపొందించిన పాకెట్ క్యాలెండర్‌ను విడుదల చేశారు.

పిల్లలు బడిలో ఉండాలి


ఆలమూరులో బాలుడికి అవగాహన కల్పిస్తున్న అధికారులు

రుద్రవరం: బడి ఈడు పిల్లలందరూ బడుల్లోనే ఉండాలని ఎంఈఓలు కోటయ్య, శ్రీలక్ష్మి తెలిపారు. శుక్రవారం వారు జీసీడీఓ సువర్చల, వెల్ఫేర్,ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, హెచ్ఎంలతో కలిసి ఆలమూరు,నర్సాపురం,తిమ్మనపల్లె తదితర గ్రామాల్లో బడికి వెళ్లని విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి వారి తల్లిదండ్రులకు విద్య ఆవశ్యకతను వివరించారు. అలాగే 14 సంవత్సరాలు నిండిన వారు దూరవిద్య ద్వారా పదవ తరగతిలో చేరేలా ఒప్పించారు. అప్పనపల్లె గ్రామానికి చెందిన బొమ్మ అవంతి, శుద్దల గురుదివ్య, వనం వనజను రుద్రవరంలోని కేజీబీవీలో చేర్పించేందుకు జీసీడీఓ అనుమతించారు.

ఉద్యోగులు సమయపాలన పాటించాలి

నంద్యాల(సిటీ): నంద్యాల మున్సిపల్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 17, 23 వార్డు సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విధుల్లో అలసత్వం చూపిన పలువురు ఉద్యోగులపై ఆరా తీశారు. వార్డు సచివాలయాల్లో స్పందనపై అర్జీదారుల అసంతృప్తి వ్యక్తమవుతుండటంతో మున్సిపల్, జిల్లా కలెక్టర్ వద్దకు ఫిర్యాదులు వెళ్తున్నాయన్నారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు.

ముగిసిన ధార్మిక కార్యక్రమాలు

రుద్రవరం: మండలంలోని నర్సాపురం లక్ష్మీనరసింహస్వామి,రామాలయాల్లో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో చేపట్టిన ధార్మిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలు శుక్రవారం ముగిశాయి. నాలుగు రోజుల పాటు ఆలయాల్లో శ్రీమద్రామయణం, మహాభారతం, భగవద్గీతపై ప్రవచనాలు వంటి కార్యక్రమాలు నిర్వహించారు. చివరి రోజున గోపూజ,కుంకుమార్చన కార్యక్రమాలతో కార్యక్రమాలను ముగించారు. ఇస్కాన్ ధర్మ ప్రచారకులు నిత్యతృప్తదాస్, మల్లు వెంకటరెడ్డి తదితరులు ఉన్నారు.

కాళికాంబదేవికి ప్రత్యేక పూజలు



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం శ్రీకాళికాంబదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

ఉయ్యాలవాడ : విద్యతోనే పేద విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని సర్పంచ్ జనపాల సాయిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని మాయలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న 35 మంది విద్యార్థులకు ప్రభుత్వం మంజూరు చేసిన ట్యాబ్‌లను పంపిణీ చేశారు. హెచ్ఎం మహమ్మద్ షరీఫ్, పీఎంసీ చైర్మన్ విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట పండింది

- వర్షాభావ పరిస్థితుల్లోనూ అనుకూలించిన వాతావరణం
- వరిలో తగ్గిన తెగుళ్లు, పెట్టుబడి
- ఆశించిన దాని కన్నా అధికంగా దిగుబడి, ధర


శిరివెళ్ల మెట్ట వద్ద ధాన్యంను ఇంటికి తరలిస్తున్న రైతన్న

శిరివెళ్ల: వర్షాభావ పరిస్థితులున్నప్పటికీ వాతావరణం అనుకూలించడంతో తెగుళ్లు తగ్గి ఖరీఫ్‌లో సాగు చేసిన వరి పంట ఆశించిన దానికన్నా అధికంగా దిగుబడినివ్వడంతో అన్నదాతల సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అలాగే సరైన సమయంలో ప్రభుత్వం కాలువల ద్వారా పంటలకు నీరివ్వడంతో రైతన్న పంట పండింది. ఖరీఫ్‌లో కేసీ కెనాల్, తెలుగు గంగ కాల్వల కింద మండలంలో 6,437 ఎకరాలలో వరి పంట సాగైంది. ప్రస్తుతం కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. ఎకరాకు 38 నుంచి 403 బస్తాల వరకు దిగుబడి వస్తుంది. అలాగే ధర కూడ రైతన్న ఊహించని విధంగా లభిస్తోంది. ప్రస్తుతం నంద్యాల సోనా రకం 75 కేజీల బస్తా రూ. 2750, కర్నూల్ సోనా రూ. 2400 ప్రకారం వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. గతేడాది ఇవే పంటలకు రూ.1200 నుంచి 1700 మధ్య ఉండింది. అప్పుడు కూడా కోత కోసిన నెల లోగానే రూ. 2 వేలు ధర పలికింది. ఇప్పుడు ధర మరింత పెరగడంతో వారి సంతోషానికి అవధుల్లేవు.

లాభ సాటిగా మారిన వ్యవసాయం..

ధర ఉంటే దిగుబడి ఉండేది కాదు. దిగుబడి ఉంటే ధర ఉండేది కాదు. ఒక పక్క పెట్టుబడులు పెరిగిపోయేయి. కానీ రెండేళ్ల నుంచి వ్యవసాయం రైతుకు పండుగగా మారింది. దిగుబడి వస్తుంది. ధర అబ్బుతుంది. ఈ ఏడాది పంట లాభసాటిగా మారింది. గతంలో వరి పంటకు తెగుళ్లు అధికంగా ఉండేవి దీంతో వాటి నివారణకు తీసుకునే చర్యలతో పెట్టుబడి పెరిగిపోయేది. ఇలా ఎకరాకు రూ.40వేలకు పైగా ఖర్చయ్యేది. ఈ ఏడాది తెగుళ్ల తగ్గడం, వాతావరణం అనుకూలంగా మారడంతో కొంతమేర పెట్టుబడి తగ్గింది. దీనికి తోడు దిగుబడి బాగా రావడం, ధర ఊహించిన దానికన్నా అధికంగా ఉండటంతో లాభాలు మూటగట్టుకున్నారు. ఎకరాకు సగటున రూ.40 వేలు ఖర్చయినా, 40 బస్తాల దిగుబడికి, రూ.2,750 ప్రకారం రూ.1,10000 వస్తుంది. పెట్టుబడి పోనూ దాదాపు రూ.60వేల వరకు లాభం మిగులుతుంది. సగటున రూ.40వేల వరకు లాభం వచ్చి ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.


వీరారెడ్డి పల్లె వద్ద కల్లంలో ఆరబోసిన ధాన్యం

'ఆడుదాం ఆంధ్ర'ను విజయవంతం చేద్దాం


పాలిటెక్నిక్ కళాశాల మైదానాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

నంద్యాల(సిటీ): నంద్యాల మున్సిపల్ పరిధిలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహణలో ప్రత్యేక చొరవ చూపి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని పలు పార్కులు, క్రీడా మైదానాలను మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పట్టణ పరిధిలో ఆడుదాం ఆంధ్రకు నమోదు చేసుకున్న క్రీడాకారులకు ఇదివరకే క్రీడా సామగ్రిని సచివాలయ సిబ్బంది ద్వారా అందించామన్నారు. కార్యక్రమాన్ని దిగ్విజయం చేయాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. క్రీడల నిర్వహణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ఎంహెచ్ఓ డాక్టర్ అంకిరెడ్డి, డీఈఈ మధుకుమార్, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి, మెప్మా సీఎంఎం విజయభాస్కర్‌రెడ్డి ఉన్నారు.

వేంకటేశ్వర స్వామికి అక్షరాభిషేకం



నంద్యాల(అర్బన్): వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని నంద్యాలకు చెందిన చిత్రకారుడు చింతలపల్లె కోటేష్ స్వామి పేర్లతో వేంకటేశ్వరస్వామి ముఖ చిత్రాన్ని చిత్రించారు. త్రేతా యుగంలో శ్రీరాముడిగా, ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడిగా, కలియుగంలో శ్రీవెంకటేశ్వరుడిగా అవతారమెత్తిన స్వామి వారిని అనేక పేర్లతో భక్తులు పిలుస్తారని, ఆ పేర్లతోనే స్వామి వారికి అక్షరాభిషేకం చేసినట్లు కోటేష్ తెలిపారు.

నేడు ముక్కోటి ఏకాదశి


ఇంజేడులో ప్రత్యేక అలంకరణలో శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి

ఉయ్యాలవాడ : ముక్కోటి ఏకాదశి సందర్భంగా మండలంలోని ఇంజేడు గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకునేలా నిర్వాహకులు ఆలయంలో ఏర్పాట్లు చేశారు. శనివారం ముక్కోటి ఏకాదశి కావడంతో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు ఆలయంలో బారికేడ్‌లు ఏర్పాటు చేశారు. అర్చకులు అనంతయ్య, రమణయ్య మాట్లాడుతూ తెల్లవారుజామున స్వామి వారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు నిర్వహించి ఉదయం 4 గంటల నుంచి భక్తులకు ఉత్తర ద్వారా దర్శనం కల్పించనున్నట్లు వెల్లడించారు.

వైకుంఠ ఏకాదశికి ఆలయాల ముస్తాబు

నంద్యాల(వ్యవసాయం): సూర్యుడు ఉత్తరాయాణానికి మారే ముందు వచ్చే శుద్ధ ఏకాదశిని వైకుంఠ ఏకాదశి లేదా ముక్కోటి ఏకాదశి అంటారు. ఈ పర్వదినాన వైకుంఠం ద్వారాలు తెరుచుకుంటాయని, వైష్ణవ ఆలయాల్లోని ఉత్తర ద్వారం ద్వారా భక్తులు స్వామిని దర్శించుకోవడానికి భక్తులు ఆలయాలను తరలివస్తారు. ఈ రోజున మహావిష్ణువు గరుడ వాహనంపై మూడు కోట్ల దేవతలతో భూలోకానికి దిగి వచ్చి భక్తులకు దర్శనమిస్తారని వేదాలు పేర్కొంటున్నాయి. ఉపవాసం ఉండి ద్వాదశి నాడు అన్నదానం చేస్తే వైకుంఠ ప్రాప్తి చెందుతారని భక్తుల నమ్మకం.

రోజాకుంటలోని..

రోజాకుంటలోని నాగులకుంట దేవాలయంలో శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి తెల్లవారుజామున 1గంట నుంచి అభిషేకాలు అనంతరం భక్తులను దర్శనానికి అనుమతిస్తామని చెప్పారు. చిత్తలూరి వీధిలో శ్రీభజన మందిరం, పద్మావతినగర్‌లోని శ్రీకృష్ణమందిరం, మద్దూరు నగర్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయంలో ఏర్పాట్లు చేశారు.

ముస్తాబైన ఆలయాలు..

పట్టణంలోని గుడిపాటిగడ్డ శ్రీలక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో 20వేల మంది భక్తులు దర్శనానికి వస్తారని, వారికి అనుకూలంగా భారీ క్యూలైన్లను ఏర్పాటు చేసినట్లు ఈవో లక్ష్మి నారాయణ తెలిపారు. దైవదర్శనం తెల్లవారుజామున 4గంటలకు ప్రారంభమై రాత్రి 9గంటల వరకు కొనసాగుతుందన్నారు. ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాటు చేశామన్నారు. అలాగే సంజీవనగర్ రామాలయంలో వెలసిన శ్రీదేవి, భూదేవి వేంకటేశ్వరస్వామికి పవిత్రాలతో భక్తులకు దర్శనమిస్తారని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని బారికేడ్లు ఏర్పాటు చేశామన్నారు. భక్తుల దర్శనార్థం కోసం ఉత్తర ద్వారం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. బాలాజీ కల్యాణ మండపంలో భారీ క్యూలైన్లను ఏర్పాటు చేశారు. భక్తులకు ఉదయమే 5 నుంచి రాత్రి 9గంటల వరకు స్వామి వారిని దర్శించుకోవచ్చన్నారు. ద్వాదశిరోజున భక్తులతో లక్ష తులసీ దళార్చన, పుష్పాభిషేకాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


సంజీవనగర్ రామాలయంలో బారికేడ్లు ఏర్పాటు చేసిన దృశ్యం


వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించిన దృశ్యం

రైతులకు అండగా ప్రభుత్వం

ఆళ్లగడ్డ: పంట ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు పండించిన ధాన్యం నిల్వ చేసుకునేందుకు సౌకర్యాలు కల్పిస్తూ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం రాఘవరెడ్డి తెలిపారు. శుక్రవారం యార్డ్ ఆవరణలోని గోదాముల్లో ధాన్యం నిల్వ చేసుకునే పథకాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ప్రైవేటు గోదాముల్లో ధాన్యం నిల్వ చేసుకుంటే ఒక్కో బస్తాకు నెలకు రూ.5 వరక వసూలు చేయడంతో పాటు అడ్వాన్స్ కింద పెద్ద మొత్తంలో చెల్లించాల్సి ఉంటుందని, రైతులు నష్టపోకూడదని ప్రభుత్వం నామమాత్రపు ధరతో నిల్వ చేసుకునే అవకాశం కల్పించిందన్నారు. దీంతో నెలకు బస్తాకు రూ.2 ప్రకారం చెల్లించాలని, అడ్వాన్స్ కట్టాల్సిన అవసరం లేదన్నారు. ధాన్యం తరలించే సమయంలో పూర్తిగా చెల్లించవచ్చన్నారు. నియోజకవర్గంలోని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ సెక్రటరీ నారాయణస్వామి ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు చేరిన సరుకులు

రుద్రవరం: మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు చేరుతున్నాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి తెలిపారు. మండలంలోని ఎల్లావత్తుల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు,గర్భిణులు,బాలింతలకు అందించాల్సిన పౌష్టికాహార సరుకులను శుక్రవారం అందజేశారు. ఆమె మాట్లాడుతూ మండలంలోని 60 అంగన్‌వాడీ కేంద్రాలకు సరుకులు చేర్చి కేంద్రాల ఇన్‌చార్జిలకు అప్పగిస్తున్నట్లు తెలిపారు.

వ్యవసాయంపై అవగాహన


వీరారెడ్డిపల్లె గ్రామ చిత్రపటం, పంట పొలాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

శిరివెళ్ల: ప్రకాశం జిల్లా మార్కాపురం ఎస్ఎస్ వ్యవసాయ కళాశాల ఏజీబీఎస్సీ చివరి సంవత్సరం విద్యార్థులు మండలంలోని వ్యవసాయ విధానాలపై క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు. యర్రగుంట్ల, శిరివెళ్ల, వీరారెడ్డిపల్లె గ్రామాలను ఎంపిక చేసుకొని అవగాహన పెంచుకుంటున్నారు. శుక్రవారం వీరారెడ్డిపల్లెలో గ్రామ స్వరూపం, పొలాలు, పంటలను చిత్రీకరించి గ్రామస్తులకు కళ్లకు కట్టినట్లు చూపించారు. విద్యార్థులు అనూష, అంజలి, లక్ష్మీతులసీ నెల రోజులుగా గ్రామంలోని పంటల సాగు, రుణాలు, రైతు భరోసా కేంద్రం పనితీరుపై రైతులను అడిగి తెలుసుకుంటున్నారు. నంద్యాల ఏరువాక శాస్త్ర వేత్త డాక్టర్ బాలాజీ, ఎస్ఎస్ వ్యవసాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ భార్గవ, రైతులు పాల్గొన్నారు.

ఎండీయూ వాహనాల వెంట వలంటీర్లు ఉండాలి

చాగలమర్రి: మండలంలో రేషన్ సరుకులను పంపిణీ చేసే ఎండీయూ వాహనాల వెంట గ్రామ వలంటీర్లు తప్పనిసరిగా ఉండాలని డిప్యూటీ తహసీల్దార్ విజయ్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ సమావేశ భవనంలో ఎండీయూ ఆపరేటర్లు, రేషన్ షాపు డీలర్లు, వలంటీర్లు, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రేషన్ సరుకుల పంపిణీ సమాచారాన్ని వలంటీర్లు తమ పరిధిలోని కార్డుదారులకు రెండు రోజుల ముందే తెలపాలని సూచించారు. వాహనాన్ని ప్రతి 5 ఇళ్లకు ఒక చోట ఆపి సరుకులు పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారని చెప్పారు. అంతే కాకుండా ప్రభుత్వ గోదాముల్లో రాగుల నిల్వలు అధికంగా ఉన్నాయని, ప్రతి కార్డుదారునికి కేజీ రాగులు కొనేటట్లు వలంటీర్లు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీఓ మహబూబ్‌దౌలా, వీఆర్‌ఓ వెంకట్రామిరెడ్డి, డీలర్లు పాల్గొన్నారు.

డాక్టర్ రవికృష్ణకు పురస్కారం

నంద్యాల టౌన్: ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా ఈ సంవత్సరంలో డాక్టర్ జి.రవికృష్ణ రాష్ట్రంలో సభ్యుల సంఖ్యను పెంచేందుకు, వివిధ వైద్య విద్యా సదస్సులు, వైద్య సేవా కార్యక్రమాలు, వైద్యుల సమస్యల పరిష్కారంలో చేసిన కృషికి జాతీయ ఐఎంఏ ఉత్తమ రాష్ట్ర అధ్యక్షుడిగా జాతీయ పురస్కారం ప్రదానం చేయనున్నట్లు ఆయన శుక్రవారం తెలిపారు. ఈనెల 27న తిరువనంతపురంలో నిర్వహించనున్న 98వ జాతీయ ఐఎంఏ సదస్సులో పురస్కారాన్ని అందజేస్తారని చెప్పారు.

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం


నంద్యాలలోని బాలికల ఉన్నత పాఠశాలలో విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం


ఉయ్యాలవాడలో రామాన్‌జన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు


రుద్రవరం కేజీబీవీలో గణిత చార్టులను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో శుక్రవారం ప్రముఖ గణిత శాస్త్ర వేత్త శ్రీనివాస రామానుజన్ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి, డీఈఓ మేరకు జిల్లా సమన్వయకర్త పాఠశాల హెచ్ఎం పద్మావతి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. గణిత, క్విజ్, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి 11 మంది విద్యార్థినులకు బహుమతులు అందజేశారు.సైన్స్ అధికారి సుబ్బారెడ్డి, సుందర్ రావు, జిల్లా దీక్ష కోఆర్డినేటర్ నాగేంద్రకుమార్ మాట్లాడుతూ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులలో దాగిఉన్న సృజనాత్మతను వెలికి తీసేందుకు పోటీలు నిర్వహించామన్నారు. జిల్లా స్థాయి గణిత పోటీల్లో సుస్మితాభవాని, షేక్షా క్షావలి, ఛత్రసాగర్, ముస్తాన్‌బీ, మేఘన, లీలాపాదవ్, శిరీష, షేక్‌ముస్కాన్, సుస్మితాభవాని, సుల్తానా, హర్షితలకు బహుమతులు లభించాయన్నారు. నంద్యాల, పోలూరు,గోస్పాడు, చాపిరేవుల పాఠశాలల విద్యార్థులు విజేతలుగా నిలిచారని చెప్పారు. గురురాజ పాఠశాలలో చైర్మన్ దస్తగిరిరెడ్డి రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఉయ్యాలవాడ : గణిత శాస్త్ర పితామహుడు శ్రీనివాస రామాన్‌జన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు రెడ్డి సూచించారు. శుక్రవారం గణిత శాస్త్ర దినోత్సవం సందర్భంగా స్థానిక మోడల్‌స్కూల్‌లో విద్యార్థులు రంగోలి, వివిధ రకాల స్టాల్స్, గణిత ప్రదర్శనలు చేపట్టారు. విద్యార్థులు తయారు చేసిన స్టాల్స్ ఆకర్షణగా నిలిచాయి. అనంతరం రామాన్‌జన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రుద్రవరం: స్థానిక కేజీబీవీలో శుక్రవారం గణిత శాస్త్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.గణిత శాస్త్ర పితా మహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా ప్రిన్సిపాల్ లక్ష్మీ దేవి,ఉపాధ్యాయినులు, విద్యార్థులు ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాలికల సాంస్కృతిక కార్యక్రమం రూపంలో గణిత శాస్త్ర ప్రాముఖ్యతను వివరించారు.

బహుజనులకు అండగా ఉంటాం

నంద్యాల(సిటీ): జిల్లాలోని బహుజనులకు సమాజ్‌వాదీ పార్టీ అండగా నిలుస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పాశ్యం వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం పట్టణంలో పార్టీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభించారు.

హాస్టళ్లలో వసతుల కల్పనకు కృషి


సమస్యలను జేసీకి వివరిస్తున్న వార్డెన్ సువర్ణ

నంద్యాల(అర్బన్): సంక్షేమ వసతి గృహాల్లో మౌలిక వసతులకు ప్రతిపాదనలు పంపితే పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. స్థానిక బొమ్మలసత్రం వద్ద ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ సమీకృత బాలికల వసతి గృహాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా భోజనాన్ని పరిశీలించారు. వసతి గృహంలో ఫ్లోరింగ్ దెబ్బతినడం, గదులు వెలుస్తుండటం, తదితరాలను వార్డెన్ సువర్ణ జేసీ దృష్టికి తెచ్చారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉందన్నారు. జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి లక్ష్మీదేవి ఉన్నారు.

బిల్లలాపురం వీఆర్‌ఏ మృతి

నంద్యాల(అర్బన్): బిల్లలాపురం గ్రామ తలారి (వీఆర్ఏ) మండ్ల సుబ్బుడు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ రమాదేవి, వీఆర్ఓలు, వీఆర్ఏలు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అంత్యక్రియల నిమిత్తం ప్రభుత్వం తరపున రూ.15వేలు, వీఆర్ఏ అసోసియేషన్ నుంచి రూ.5వేలు కుటుంబ సభ్యులకు అందించారు.

గుండెపోటుతో ఆటో డ్రైవర్ మృతి


చాగలమర్రిలో ఆటోలోనే మృతి చెందిన డ్రైవర్ హమద్‌బాషా

చాగలమర్రి: స్థానిక కోటగడ్డ వీధికి చెందిన ఆటో డ్రైవర్ ఉచ్చుసాగారి హమద్‌బాషా (45) ఆటోలోనే నిద్రిస్తూ గుండెపోటుతో మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మృతుడు హమద్‌బాష గత కొన్నేళ్ళుగా స్వంతంగా ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇతనికి భార్య ఉమేరా, ముగ్గురు సంతానం ఉన్నారు. రోజులాగే శుక్రవారం ఉదయం ఇంటి నుంచి ఆటో తీసుకెళ్లాడు. మధ్యాహ్నం స్థానిక కేరళా ఆసుపత్రి వద్ద నలతగా ఉందని తోటి డ్రైవర్లతో చెప్పి ఆటోలోనే నిద్రపోయాడు. కొద్ది సేపటికి అక్కడే ధర్నా చేస్తున్న అగన్‌వాడీ కార్యకర్తలు అనుమానంతో కేరళా ఆసుపత్రికి తీసుకెళ్ళగా వైద్యులు పరిశీలించి మృతి చెందాడని ధ్రువీకరించారన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో నంద్యాలకు పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులు

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ఉమ్మడి జిల్లాలోని నంద్యాలకు పతకాలు లభించాయని తైక్వాండో ఉమ్మడి జిల్లాల అసోసియేషన్ ప్రెసిడెంట్ సుందర్‌రాజు, సెక్రటరీ మహబూబ్‌బాషా శుక్రవారం తెలిపారు. వారు మాట్లాడుతూ ఈనెల 16, 17 తేదీల్లో గుంటూరు జిల్లా రేపల్లెలో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ క్యాడెట్ తైక్వాండో పోటీల్లో 11 మంది విద్యార్థులు పాల్గొనగా 8 మంది ప్రతిభ చూపారన్నారు. జిల్లాకు ఒక స్వర్ణం, మూడు రజత, నాలుగు కాంస్య పతకాలు సాధించి జిల్లాకు పేరు తెచ్చారన్నారు. జంషిద్ హుసేన్ అండర్-53 కేజీ క్యాడెట్‌విభాగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం సంతోషకరమన్నారు. సబ్ జూనియర్ విభాగంలో జంషీద్ హుసేన్‌కు స్వర్ణం, బీవీ హర్షిత, అంజలి(రజత), అద్వైత(కాంస్య), ఎం.బ్లెషీ(కాంస్య), కమల్‌నాథరెడ్డి(కాంస్య) పతకాలు సాధించగా క్యాడెట్ విభాగంలో అస్మా(రజత), కమల్‌నాథరెడ్డి(కాంస్య), బ్రహ్మతేజ(కాంస్య) పతకాలు సాధించారన్నారు. విద్యార్థులను ఈసీ మెంబర్ ఉదయ్‌కిరణ్‌తో కలిసి అభినందించారు.

క్రైస్తవుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆళ్లగడ్డ: క్రైస్తవుల సమస్యలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని వైఎస్సార్‌సీపీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర పధాన కార్యదర్శి జోసెఫ్ అన్నారు. స్థానిక ఎల్ఎం కాంపౌండ్‌లోని ప్రేయర్ పవర్ చర్చిలో శుక్రవారం సెమీ క్రిస్మస్ సెలబ్రేషన్, పాస్టర్ల సదస్సు నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జోసెఫ్‌ను పాస్టర్లు సన్మానించారు. అనంతరం పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు.


పాస్టర్లను సన్మానిస్తున్న జోసెఫ్